ప్రజాశక్తి
గురువారం 6 జులై 2023
5
పార్వతీపురం మన్యం

టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్
ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని డెన్సరాయి పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ చట్టం కింద జరిగిన పనులు, కూలీలకు చెల్లింపులకు సంబంధించి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై టెక్నికల్ అసిస్టెంట్ వై.తిరుపతి రావును సస్పెండ్ చేస్తూ జిల్లా డ్వామా పిడి రామచంద్రరావు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధిహామీ బిల్లుల మంజూరులో టెక్నికల్ అసిస్టెంట్ తిరుపతిరావు అక్రమాలకు పాల్పడ్డారని గ్రామస్తులు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై 'ప్రజాశక్తి' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి విచారణకు ఆదేశించారు. ఎపిడి శ్రీహరి విచారణ జరిపి నివేదిక అందజేశారు. టిసిని సస్పెండ్ చేయాలని కోరుతూ అధికారపార్టీకి చెందిన నాయకుడు జిల్లా మంత్రి ద్వారా అధికారులపై ఒత్తిడి తేవడంతో ఆయన్ను సస్పెండ్ చేశారు.

ప్రయివేటు స్కూళ్లలో పుస్తకాల బాదుడు

ప్రయివేటు స్కూల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలు

ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాల భారం విద్యార్థుల తల్లిదండ్రుల పాలిట పెనుభారంగా మారింది. ప్రభుత్వం ముంద్రించిన పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేయడం లేదు సరికదా, ప్రైవేటు పబ్లిషర్స్ నుంచి తెచ్చుకున్న పుస్తకాల ధరలు నాలుగింతలు పెంచి విక్రయిస్తున్నారు. నారాయణ, చైతన్య వంటి స్కూళ్లలో అయితే మరీ దారుణంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 10 తరగతి విద్యార్థుల నుంచి పుస్తకాల కోసం రూ.6వేలు నుంచి రూ.20వేలు వరకు వసూలు చేయడం గమనార్హం.

- రూ.6 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలు
- అచేతనంగా అధికారులు
- పట్టించుకోని ప్రభుత్వం
- విద్యార్థుల తల్లిదండ్రులపై పెనుభారం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రైషనలైజేషన్ పేరిట చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలను ఎత్తివేసిన విషయం విధితమే. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1699 వరకు ఉన్నాయి. వీటిలో 1,20,149 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు 116 వరకు ఉన్నాయి. వీటిలో సుమారు 23,388వేల మంది వరకు చదువుతున్నారు. వాస్తవానికి అన్ని పాఠశాలల్లోనూ ప్రభుత్వం రూపొందించిన పుస్తకాలను బోధించాల్సి వుంది. ప్రభుత్వ పాఠశాలల వరకు ఇది అమలవుతున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను కొనుగోలు చేయడం లేదు. వీటిలోవున్న పాఠ్యాంశాలను కాస్త అటు ఇటుగా మార్పులుచేసి, ఆమేరకు పేజీలు పెంచి ప్రైవేటు పబ్లిషర్స్ ముద్రించిన పుస్తకాలను ఇక్కడ బోధిస్తున్నారు. వీటికి వర్కుబుక్స్, నోట్‌బుక్స్ వంటివి జత చేసి భారీ మొత్తానికి విక్రయిస్తున్నాయి. దీనికి తోడు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు తమ వద్దే కొనాలని మెలికపెట్టడంతో వాటిని కొనుగోలు చేయడానికి తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా నారాయణ, చైతన్య తదితర కార్పొరేట్ స్కూళ్లలో 1వ తరగతి నుంచి 10వ తరగతి లోపుగల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలకు రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇవి కాకుండా యూనిఫారాలు కూడా బయట కొనుక్కోవడానికి వీలు లేదు. వాస్తవానికి ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు సరిపడిన పుస్తకాలను ప్రభుత్వమే ముద్రించింది. సరిపడినంత మేరకు జిల్లాలకు విరివిరిగా కేటాయించింది. ప్రైవేటు పాఠశాలలు కేవలం పుస్తకాల విలువపై 5శాతం చెల్లించి ఆర్డర్స్ ఇవ్వడానికే పరిమితమయ్యాయి. వీటిని ప్రైవేటు యాజమాన్యాలు కొనుగోలు చేసి, విద్యార్థులకు ఇవ్వడానికి రూ.700 నుంచి రూ.1000 లోపే సరిపోతుంది. పుస్తకాల్లోనూ కక్కుర్తిపడ్డ యాజమాన్యాలు నిబంధనలు తుంగలో తొక్కుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ పాఠ్యపుస్తకాల బోధన మాత్రమే చేయాలన్న నిబంధనను అధికారులు పట్టించుకోవడం లేదు. పుస్తకాలపై బాదుడును అధికారులు అరికట్టలేక అచేతనంగా ఉన్నారు.

విక్రయానికి సిద్ధంగా ఉంచిన యూనిఫాం

ఫిర్యాదు వస్తే చర్యలు

పుస్తకాలు నిర్ణీత ధరల కంటే ఎక్కువకు ఎవరైనా విక్రయించిన ట్టయితే చర్యలు తీసుకుంటాం. ఏ పాఠశాల యాజమాన్యం వారైనా అధిక ధరలకు విక్రయిస్తే తమ దృష్టికి తీసుకురావాలి. ఈ విషయమై ఇంత వరకు తమకు ఇటువంటి ఫిర్యాదు చేయలేదు. ఫిర్యాదు లేకున్నా ఎంఇఒలతో మోనటరింగ్ చేయిస్తాం.

- ఎన్.ప్రేమ్‌కుమార్, డిఇఒ

పూర్తయిన భవనాలు అప్పగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

నిర్మాణాలు పూర్తయిన భవనాలను సంబంధిత శాఖల అధికారులకు అప్పగించాలని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రాధాన్యతా భవనాల నిర్మాణాల పురోగతిపై మండలాల వారీగా పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగు అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ పూర్తిచేసిన సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను సంబంధితశాఖ అధికారులకు వెంటనే అప్పగించాలన్నారు. పనులు పూర్తికాకుండా పూర్తయినట్లుగా నివేదికలు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, నిర్మాణాలు పూర్తయిన భవనాల్లో మౌలికసదుపాయాలు పూర్తి చేయాలన్నారు. చివరదశలో గల భవనాలను ఈనెల 12నాటికి పూర్తిచేసి అప్పగించాలని తెలిపారు. భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి బిల్లులు చెల్లింపులు పూర్తి చేయాలని సూచించారు. బేస్‌మెంటు దాటిన భవన నిర్మాణాలు పూర్తిచేయాల న్నారు. వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి నిధులు సమస్యలేదని, మంజూరైన మొత్తం వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం సిమెంటు కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని, సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుగుతున్నాయని కావున అధికారులు లక్ష్యం మేరకు నిర్మాణ పనులు పూర్తిచేయించాలన్నారు. చేసిన పనులకు బిల్లులను వెంటనే చెల్లింపుల కొరకు పంపించాలన్నారు. పనులు రోజువారీ ప్రగతిని పర్యవేక్షించి, నివేదిక అందించాలని జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్‌శాఖ డిఇ, ఎఇ, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

క్లిష్టమైన ప్రసవ కేసులను నేరుగా విశాఖపట్నం పంపించాలి

పార్వతీపురంరూరల్ : గత నెలలో సంభవించిన ప్రసవ మరణాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, క్లిష్టమైన ప్రసవ కేసులను నేరుగా విశాఖపట్నం పంపించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ ఆదేశించారు. బుధవారం వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. క్లిష్టమైన ప్రసవ కేసులను నేరుగా విశాఖ కెజిహెచ్ కి పంపించాలని తెలిపారు. తల్లి, బిడ్డల వివరాలు నూరుశాతం నమోదుచేయాలని, రక్తహీనత, హెమాగ్లోబిన్ తక్కువగా గల గర్భిణీలకు, బాలింతలకు అవసరమైన వైద్యం, మందులు, పౌష్టికాహారం అందించాలని తెలిపారు హై రిస్క్ గర్భిణీలను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. టీకాల కార్యక్రమం తక్కువగా నమోదు కావడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. పార్వతీపురం, సాలూరు, కురుపాం, భద్రగిరి లలో చేపట్టిన ఆసుపత్రుల నిర్మాణ పనుల పురోగతిని, ఇతర ఆసుపత్రుల పునర్నిర్మాణ పనుల పరిస్థితిని సమీక్షించారు. నిర్మాణ పనులను నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథ రావు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.బి.వాగ్దేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పార్వతీపురం పట్టణ ఎస్ఐలుగా దినకర్, నారాయణరావు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ఎస్ఐలుగా దినకర్, పి.నారాయణరావు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు పట్టణంలో శాంతి భద్రత పరిరక్షణకు కృషి చేస్తామని, ఈవ్ టీజింగ్, వాహన ప్రయాణాలపైన, నాటుసారా రవాణాల పైన,గృహహింస, మహిళలపై వేధింపులు, అసాంఘిక కార్యకలాపాల పైన ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు

ఎమ్మెల్యే, జెఎసి నాయకుల మధ్య జరుగుతున్న వాగ్వివాదం

గిరిజన సమస్యలపై
ఎమ్మెల్యేకు నిరసన సెగ

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దుడ్డ ఖల్లు పంచాయతీలో పర్యటించిన కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణికు గిరిజనుల నుంచి నిరసన సెగ తగిలింది. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొవద్దని, నాన్ షెడ్యూల్డ్ గ్రామాలను గిరిజన గ్రామాలుగా గుర్తించాలని, గాంద్ర, రేగిడి గెడ్డ పనులు పూర్తిచేయాలని, మౌలిక వసతులు కల్పించాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సమస్యలపై ప్రశ్నించిన జెఎసి నాయకులు నిమ్మక సింహాచలం, ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి, వైసిపి నాయకుల మధ్య మాటలు యుద్ధం జరిగింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సింహాచలం ప్రశ్నించారు. అందుకు సమాధానంగా ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ విడతలుగా నెరవేరుస్తున్నామని, అనవసరంగా రాద్ధాంతం చేయవద్దని అన్నారు. లోవ ముఠా ప్రాంతంలో ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో అన్ని వీధుల్లోనూ పర్యటించి ప్రజలకు అందుతున్న పలు సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిపి కె.దీనమయ్య, వైస్ ఎంపిపి లక్ష్మణరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి. గిరిబాబు, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు బి. గౌరీ శంకర్రావు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతిని కుటుంబానికి రూ.25 వేలు

ఇటీవల మరణించిన గుమ్మలక్ష్మీపురానికి చెందిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న కిల్లక రవికుమార్ కుటుంబానికి కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. బుధవారం రవికుమార్ గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రవికుమార్ గృహ నిర్మాణం సగంలో ఆగిపోయిన నేపథ్యంలో ఈ ఆర్థికంగా సహాయం అందించారు.

వృద్ధుడిపై దౌర్జన్యం... స్థలం ఆక్రమణ

- శృతి మించిన విశ్రాంత విఆర్ఓ ఆగడాలు
- అధికారపార్టీ నాయకుల అండదండలు
- ఫిర్యాదు చేసినా స్పందించని పోలీసులు
- ఎస్‌పి ఆదేశాలతో విచారణ

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని తోణాంలో ఓ వృద్ధునిపై దౌర్జన్యానికి దిగడంతో పాటు అతని స్థలం ఆక్రమణకు పాల్పడిన విశ్రాంత విఆర్ఓ నాగభూషణం ఆగడాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. గ్రామానికి చెందిన వల్లభనేని బ్రహ్మానందరావు (82) సుమారు నెలరోజుల క్రితం తనకు జరిగిన అన్యాయం గురించి మండల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన సర్వే నెంబర్9లో కొనుగోలు చేసిన గ్రామ కంఠం భూమిలో పెంకుటిల్లులో నివాసం వుంటున్నారు. ఆయనకు కూతవేటు దూరంలో ఆయన కుమార్తె ఇల్లు ఉంది. ఆయన ఇంటి పక్క స్థలంపై కన్నేసిన రిటైర్డ్ విఆర్వో నాగభూషణం ఆ స్థలం ఆక్రమించి దౌర్జన్యంగా అక్కడ ఉన్న చెట్లను నరికేశారు. జెసిబి సాయంతో పెద్ద చెట్లను పెకలించడమే కాకుండా స్థలంలో వున్న మంచినీటి బోరుని ధ్వంసం చేశారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడం వెనుక అధికారపార్టీ నాయకుల అండదండలు వుండడమే కారణమని తెలుస్తోంది. కదల్లేని పరిస్థితుల్లో ఉన్న ఆయన గత్యంతరం లేక మే29న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండల తహశీల్దార్ బాలమురళీకృష్ణ స్థలపరిశీలన చేశారు. రిటైర్డ్ విఆర్వో నాగభూషణం ఆక్రమించిన స్థలం బ్రహ్మానందరావు దేనని నిర్ధారించారు. మండల సర్వేయర్ కూడా సర్వే చేసి నివేదిక అందజేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరపాలని జిల్లా ఎస్పీ టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావును ఆదేశించారు. ఆయన కూడా విచారణలో భాగంగా ఇరువర్గాల వాదనలు విన్నారు. వల్లభనేని బ్రహ్మానందరావు ఉంటున్న ఇల్లు, దాని పక్క స్థలానికి సంబంధించి పన్నులు, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారా లేదా అని వివరణ కోరుతూ విచారణ అధికారి శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శికి నోటీసు జారీ చేశారు. వృద్ధుడు బ్రహ్మానందరావు ఫిర్యాదు చేసి నెలరోజులైనా నాగభూషణంపై ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడం వల్లనేనని, పోలీసులు విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎస్పీ ఆదేశించినా విచారణ పేరుతో తాత్సారం చేయడం చర్చనీయాంశమైంది. దీనిపై ఫిర్యాదు దారుడు బ్రహ్మానందరావుతో మాట్లాడగా జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి నెలరోజులు అయిందన్నారు. స్థానిక పోలీసులు స్పందించకపోవడం వల్లనే జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తనకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆలిషాని వివరణ కోరగా బ్రహ్మానందరావు ఇంటి పన్ను, కరెంట్ బిల్లులు చెల్లిస్తున్నారని చెప్పారు. విచారణ అధికారి శ్రీనివాసరావును వివరణ అడగ్గా వివాదానికి సంబంధించి కొన్ని వివరాలు కోరుతూ పంచాయతీ కార్యదర్శికి నోటీసు జారీ చేసినట్లు చెప్పారు. సమాచారం రాగానే జిల్లా ఎస్పీకి నివేదిక అందజేస్తామని తెలిపారు.

బ్రహ్మానందరావు స్థలంలో నరికేసిన చెట్లు

ఎస్‌పికి చేసిన ఫిర్యాదు కాపీ చూపుతున్న బ్రహ్మానందరావు

పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి - కొమరాడ

జిల్లాలోని పలుచోట్ల భారీ వర్షం కురిసింది. కొమరాడ, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట తదితర మండలాల్లో వర్షం కురిసింది. కొమరాడ మండలంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం పడింది. దీంతో అన్నదాతల్లో ఆశలు చిగురించాయి. ఒకవైపు రైతులు గడిచిన పది రోజులుగా వరి ఆకుపోతలు, ఎదలు, పత్తి విత్తనాలు పొలాల్లో వేయడంతో వర్షా లేక బాగా ఎండిపోతున్న తరుణంలో బుధవారం గంటన్నర పాటు భారీగా వర్షం కురవడంతో రైతుల ఆనందానికి అంతులేదు. గత ఏడాది ఇదే సమయానికి మండలంలో 80శాతం వరి నాట్లు పడ్డాయి. ఈ ఏడాది ఇంకా ఎక్కడా వరి నాట్లు ప్రారంభం కాకపోవడంతో రైతుల్లో కొంత నిరాశ ఉంది. ఏది ఏమైనా ఈ రెండుల్లో ఇదే పెద్ద వర్షమని రైతులు అంటున్నారు. ఈనెల 20కల్లా వరి నాట్లు నాటితే తప్ప రైతులు తర్వాత వరినాట్లు వేసినా అనుకున్నంత పంట దిగుబడి రాదని ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సందర్భంలో ఈనెల 20లోగా మరో రెండు, మూడు వర్షాలు ఇలా పెద్దవి పడితే రైతుల పొలాల్లో వరి పూర్తిగా నాటే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు.

పాలకొండలో కుండపోత వర్షం

పాలకొండ : డివిజన్ కేంద్రమైన పాలకొండలో బుధవారం కుండపోత వర్షం కురిసింది. గతకొద్ది రోజులుగా ఎండల వేడిమితో ఇబ్బందులుపడుతున్న ప్రజలకు ఈ వర్షం సేదతీర్చింది. ఖరీఫ్ సాగుకు ఈ వర్షం ఊరటనిచ్చింది. వర్షం కారణంగా ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.

కురుపాంలో కురుస్తున్న భారీ వర్షం

అమ్మఒడి ఉత్సవాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

విద్యారంగానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి -మక్కువ రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యా వ్యవస్థకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అనేక పథకాల అమలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర తెలిపారు. బుధవారం మక్కువలో నిర్వహించిన నాలుగో విడత అమ్మఒడి ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత నెల 28న అమ్మఒడి నాలుగో విడత ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లా నుంచి ప్రారంభించి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో దాదాపు రూ.6,500 కోట్లను జమచేశారన్నారు. పండుగ వాతావరణంలో పదిరోజుల్లో జిల్లాలో 86,409 మంది తల్లుల ఖాతాల్లో రూ.139.61 కోట్లు జమ అవుతున్నాయని తెలిపారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు జగనన్న కిట్లు, ఇతర అవసరమైన వస్తువులు పంపిణీ చేసిందని తెలిపారు. ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, సహాయ సహకారాలతో, అధికారులు, ఉపాధ్యాయుల కృషితో పదవ తరగతి పరీక్షల్లో 87.40 శాతం సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలించిందని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావునాయుడు, వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, మండల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

గ్రీన్ అంబాసిడర్లకు ఏడాది కాలంగా బకాయి ఉన్న జీతాలు వెంటనే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ప్రతిరోజు గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచుతున్న గ్రీన్ అంబాసిడర్ల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఏడాదిగా వేతనాలివ్వకుంటే పెరుగుతున్న ధరలతో ఎలా బతికేదని ప్రశ్నించారు. గ్రీన్ అంబాసిడర్ల వ్యవస్థను సర్పంచులకు అప్పగించడం వల్ల ప్రతినెలా వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రతిరోజూ చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ఇచ్చిన రిక్షాలు ఎప్పటికప్పుడు మరమ్మతులకు గురైతే సొంత నగదు ఖర్చుపెట్టి బాగు చేసుకుంటున్నారని అన్నారు. గ్రీన్‌అంబాసిడర్ల పట్ల ప్రభుత్వం చిన్నచూపు తగదన్నారు. గ్రీన్ అంబాసిడర్లకు గుర్తింపు కార్డులివ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి కె.గౌరీశ్వరరావు, జిల్లా నాయకులు కోలక అవినాష్, ఎపి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మండంగి రమణ, గ్రీన్‌అంబాసిడర్ల మండల అధ్యక్షులు పాండురంగారావు, గ్రీన్ అంబాసిడర్లు మాధవ, భూషణ ఉన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు, సిఐటియు నాయకులు

అధికారులతో సమీక్షిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. బుధవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎపిఇపిడిసిఎల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ హౌసింగ్ లే అవుట్లకు నీరు, విద్యుత్ సౌకర్యం వెంటనే కల్పించాలన్నారు. అదే విధంగా వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో క్లోరినేషన్ ప్రక్రియ పక్కాగా జరగాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. ఇంటింటికి కొళాయి పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాల పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ టి.ఎస్ ప్రసాద్, మన్యం జిల్లా ఎస్ఇ ప్రభాకరరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ దైవ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఇ విఎస్ఎన్ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ జాన్ బెన్‌హర్, ఎపిఇపిడిసిఎల్ ఇఇలు బి.నాయుడు, జి.ప్రసాద్, రాజశేఖర్, మూర్తి, పంచాయతీరాజ్ ఇఇలు సురేష్ కుమార్, గిరిధర్, రాధారాణి, ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి, అన్ని శాఖల డిఇలు తదితరులు పాల్గొన్నారు.

గొట్టివలస ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు

గొట్టివలసలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని గొట్టివలస ఆర్అండ్‌బి ప్రధాన రహదారి పరిధిలో బుధవారం ఏనుగులు సంచరించడంతో ప్రజలు భయాందోళన గురవుతున్నారు. పార్వతీపురం-గరుగుబిల్లి ప్రధాన రహదారి పరిధి గొట్టివలస ప్రాంతంలో పై ఏనుగులు సంచరించడంతో వాహన చోదకులు భయాందోళనకు గురయ్యారు. మొన్నటి వరకు జియ్యమ్మ వలస, కొమరాడ మండలాల్లో సంచరిస్తున్న ఏనుగుల రెండు రోజుల క్రితం గరుగుబిల్లి మండలంలోని సీమలవానివలస,గొట్టివలస గ్రామాల్లో సంచరిస్తున్నాయి. గ్రామానికి అతి సమీపంలోని మామిడి తోటల్లో ఏనుగులు తిష్ట వేయడంతో పంట పొలాలకు వెళ్లలేకపోతున్నామని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక గెడ్డలో గ్రామసభ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దారబ పంచాయతీ ఇసుకగెడ్డలో సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామానికి ప్రత్యేకాధికారిగా ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ప్రభాకర్ రావు వ్యవహరిస్తున్నారు. ఎంపిడిఒ కె.సత్యం ఆధ్వర్యాన జరిగిన గ్రామసభలో గ్రామ అవసరాలను గుర్తించారు. గిరిజనులతో మాట్లాడారు. ఎంపి మాధవి, ఎమ్మెల్యే కళావతి కృషితో ఇసుకగెడ్డ దత్తత గ్రామంగా ఎంపికైందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పాపారావు, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధ్యాయులకు రెండు రోజులు పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంఇఒలు జి.సూర్య దేముడు, ఎం.వెంకటరమణ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో ఉపాధ్యాయులకు బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల కింద ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయ సిబ్బందికి ఈనెల ఒకటి నుంచి 15 వరకు విజయనగరం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీలో శిక్షణ తరగతులు జరుగుతున్నాయన్నారు. ఒక్కొక్క ఉపాధ్యాయునికి రెండేసి రోజులు ఈ శిక్షణ తరగతులు ఉంటాయని వారు తెలిపారు. సమావేశంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతానగరం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, అంగన్వాడీ కార్యకర్తలు ఎం.సునీత, నాగమణి, పి.లక్ష్మి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిన జనసేన కార్యకర్తలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సీతానగరం మండలం నిడగల్లుకు చెందిన జనసేన కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైసిపిలో చేరారు. వీరందర్నీ బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం పలికారు. మీ అందరి ఆశయాలకు అనుగుణంగా మీరు కోరిన విధంగా నిడగల్లు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పూర్తి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి టి.సూర్యనారాయణ, వైసిపి సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, గాజాపు శ్రీనివాసరావు, బర్ల సింహాచలం, బర్ల వెంకటరమణ, శంకర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లో ఓల్టేజి సమస్యను పరిష్కరించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

లోఓల్టేజి సమస్యను పరిష్కరించాలని వీరఘట్టం బిసి కాలనీ వాసులు అధికారులను కోరుతున్నారు. గత కొంతకాలం నుంచి లోఓల్టేజి సమస్య కవల్ల ఫ్యాన్లు తిరగడం లేదని, టీవీలు పలకడం లేదని తెలిపారు. ఈ కారణంగా రాత్రి అయ్యేసరికి కంటిమీద కునుకులేకుండా అయ్యేసరికి పోతుందని, తక్షణమే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి లోఓల్టేజి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నారు.

ఇసుక తెచ్చుకునేందుకు అనుమతివ్వాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

ప్రధానమంత్రి ఆవాస గృహాలు నిర్మించుకునేందుకు ఇసుక తెచ్చుకునేందుకు తమకు అనుమతులు ఇవ్వాలని మండలంలోని దశమంతపురం పంచాయతీ పరిధి పెద్దూరు గిరిజన గ్రామానికి చెందిన నిమ్మక ప్రశాంతి, బిడ్డిక విజయశాంతి తదితర లబ్ధిదారులు కోరారు. ఇసుక కొరత వల్ల నిర్మాణాలు చేపట్టలేక మంజూరైన ఇళ్ల పనులు ప్రారంభించలేని స్థితిలో ఉన్నామని తెలిపారు. అధికారులు స్పందించి తమకు ఇసుక తెచ్చుకునేందుకు అనుమతులివ్వాలని అధికారులను కోరినట్లు గిరిజనులు తెలిపారు.

సచివాలయ సిబ్బంది ఔదార్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక సచివాలయంలో వాలంటీరుగా రజని పనిచేస్తుంది. ఈమె భర్త రవికుమార్ ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆమెను ఆర్థికంగా ఆదుకొనేందుకు స్థానిక పంచాయతీ కార్యదర్శి కిషోర్, విఆర్ఒ కృష్ణ, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు కలిసి రూ.9వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు సర్పంచ్ గౌరీశంకర్ ద్వారా బుధవారం ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి కిషోర్ కుమార్, వర్తక వైశ్య సంఘం అధ్యక్షులు కొత్తకోట విష్ణు ప్రసాద్, జి. హరిప్రసాదరావు, ఉప సర్పంచ్ కిషోర్ కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు సహజం

ప్రజాశక్తి-పాలకొండ రురల్

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని తహశీల్దార్ సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండాపురం, అంపిలి గ్రామ సర్వేయర్లకు బదిలీ అయ్యాయి. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పని చేసిన కాలంలో బాధ్యతగా పనిచేశారని కొనియాడారు. బదిలీపై వెళ్లిన చోట కూడా ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో డీటీ బుచ్చయ్య, మండల సర్వేయర్ వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులను సన్మానిస్తున్న తోటి సిబ్బంది

ఏరియా ఆస్పత్రిలో మెరుగైన సేవలు

- వైద్యపరీక్షలకు ప్రయివేట్ ల్యాబ్‌లకు వెళ్లకుండా కృషి
- ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా త్వరలో ఒపి

ప్రజాశక్తి- సీతంపేట

ఆస్పత్రిలో పరికరాలు, వైద్యులు లేకపోవడంతో ప్రతి కేసునూ రిఫర్ చేసేవారు... మందులు, సిబ్బంది కొరత వేధిస్తూ ఉండేది... కనీసం డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వచ్చి ప్లేట్‌లెట్లు తగ్గినా వెంటనే వేరే ఆస్పత్రికి తరలించేసేవారు... ఇది ఒకప్పుడు స్థానిక ఏరియా ఆస్పత్రిలో పరిస్థితి. ఇప్పుడు అందుకు భిన్నంగా ఆస్పత్రిలో వైద్యసేవలు అందుతున్నాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బి.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆస్పత్రి సేవల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్క కేసును కూడా రిఫర్ చేయడం లేదు. అన్ని టెస్టులనూ ఆస్పత్రిలోనే చేస్తున్నారు. ఇప్పుడు అక్కడందని సేవలు అంటూ ఏమీ లేవు. ప్రస్తుతం ఏరియా ఆసుపత్రిలో 23 మంది వైద్యులకు 19 మంది వైద్యులున్నారు. వీరిలో సూపరిండెంట్ శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇద్దరు చిన్నపిల్లల వైద్యులు, ఇఎన్‌టి, ఆర్థోపెడిక్, పెథాలజీ వైద్యులను ఉన్నతాధికారుల సలహాతో తెచ్చారు. ఆర్థోపెడిక్ సర్జరీ కోసం ఉపయోగించిన యంత్రాలను పార్వతీపురం డిసిహెచ్ఎతో మాట్లాడి తెచ్చారు. భోజనాలకు టెండర్లు కూడా ఏర్పాటు చేశారు. రోగులకు నాణ్యమైన భోజనాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఆరోగ్యశ్రీ నగదు ద్వారా రోగులకు అవసరమైన మందులు కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తున్నారు. అలాగే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి మూడుసార్లు రౌండ్లకు వెళ్తున్నారు. ఇక్కడ వైద్య సిబ్బంది కూడా యూనిఫామ్‌తో దర్శనం ఇస్తారు. ప్రతి రోగి బెడ్ వద్ద బెడ్ షీట్ ఏ రోజుకి ఆ రోజు క్లాత్‌ని మార్చుతారు. ప్రతి రూమ్‌కి ఏసీతో పాటు ఫ్యాన్లు, లైటింగ్స్, మరుగుదొడ్లు, తాగునీరు, రోగులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రసవాలు గతంలో నెలకు 70 ఉంటే ప్రస్తుతం 120 వరకు జరుగుతున్నాయి. అలాగే ఇతర శస్త్రచికిత్సలు నెలకు 40 వరకు జరుగుతున్నాయి. రోజుకు ఎక్స్‌రే స్కానింగ్‌లు 40 నుంచి 50 వరకు జరుగుతున్నాయి. ప్రస్తుతం రోజుకు ఒపి 300 వరకు పెరిగింది. ఇక్కడ సకాలంలో వైద్య సేవలు అందడంతో సీతంపేట నుంచే కాకుండా పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భామిని, కొత్తూరు, పాతపట్నం, ఒడిశా రాష్ట్రంలో పర్లాకిమిడి, గుణుపూర్, కాశి నగర్ నుంచి కూడా రోగులు తరలి వస్తున్నారు. రోగులకు మెరుగైన సేవలు అందించడంతో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ డిప్యూటీ డిఎంహెచ్‌ఒగా శ్రీనివాసరావుకు అవార్డు అందించారు. అలాగే కరోనా సమయంలో అధిక సేవలు అందించి నివారణకు చర్యలు తీసుకున్నందుకు గాను అప్పటి శ్రీకాకుళం కలెక్టర్ నివాస్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. భవిష్యత్తులో ఈ ఆస్పత్రిలో ద్వారా మరిన్ని వైద్యసేవలందించేందుకు కృషి చేస్తానని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

సీతంపేట ఏరియా ఆస్పత్రి

రోగులకు ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డు

ఆయుష్మాన్ భారత్‌లో డిజిటల్ మిషన్ ద్వారా ఓపి జనరేట్ చేసి ఎలక్ట్రానిక్ హెల్త్ కార్డులు అందిస్తాం. ఈ కార్డు ద్వారా రోగుల పాత డేటా కూడా అందుబాటులో ఉంటుంది. ఇక కాగితం ఓపి ఉండదు. ఆసుపత్రి చుట్టూ గార్డెన్ తరహాలో పార్కు మాదిరిగా తీర్చిదిద్ది రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తాం.

- బి. శ్రీనివాసరావు,
సూపరింటెండెంట్, సీతంపేట ఏరియా ఆస్పత్రి

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వం ఐటిఐ కాలేజీలో స్కిల్ హబ్‌లో ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్, సూయింగ్ మిషన్ ఆపరేటింగ్ (టైలరింగ్) ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధికారి యు.సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్‌కు విద్యార్హత 8వ తరగతి నుంచి పిజి వరకు, అలాగే కుట్టుమిషన్‌కు సంబంధించి విద్యార్హత ఐదో తరగతి నుంచి పీజీ వరకు అర్హులు ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా ఫాంను, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఆధార్ కార్డ్, బ్యాంకు బుక్ జిరాక్స్ పట్టుకొని స్థానిక ప్రభుత్వ ఐటిఐ కాలేజ్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7993795796, 7032060773, 8897677564 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హుస్సేన్ పురంలో నేడు జగనన్న సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని హుస్సేన్‌పురం తలవరం గ్రామాల్లో ఈనెల 6న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాదు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులంతా ఉదయం 10 గంటలకు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

వైఎస్ విగ్రహ ఏర్పాటుపై జనసేన నిరసన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

స్థానిక ఆర్‌టిసి కూడలి సమీపంలో వైసిపి ఆధ్వర్యంలో విస్తారంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీగా వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం పట్ల జనసేన నాయకులు బుధవారం తీవ్ర నిరసనలు తెలిపారు. విగ్రహం ఏర్పాటు చేసిన స్థలంలో కళ్ళకు గంతలు కొట్టుకొని స్థానిక మున్సిపాలిటీ, ఆర్ అండ్ బి అధికారుల వైఖరికి అద్దంపట్టేలా నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యక్రమాలు నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు, వంగల దాలి నాయుడు మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుందని, తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అటువంటి చోట మెయిన్ రోడ్డుపై ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి వైఎస్ విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. తాము విగ్రహం ఏర్పాటుకు వ్యతిరేకం కాదని, కాకపోతే గతంలో విగ్రహానికి ఎంత స్థలం అయితే ఉండేదో అంత స్థలంలో మాత్రమే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా పేదలు ఏమాత్రం చిన్నపాటి కట్టడం చేసినా వారిపై విరుచుకుపడే మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులు పట్టణ మెయిన్ రోడ్డులో రద్దీ జంక్షన్లో ఎక్కువ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణం జరుగుతుంటే కళ్లుమూసుకొని ఉన్నారని, వారు కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన చేపట్టారు. పట్టణ మెయిన్ రోడ్ కి ఇరువైపులా, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే సంబంధిత అధికారులు వాటిపై చర్యలు తీసుకోకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. పేదలపై విరుచుకుపడే అధికారులు, పెద్దలపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పట్టణ మెయిన్ రోడ్డు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు స్థల విషయమై సంబంధిత ఆర్అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు, మున్సిపల్ రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిట్లు గణేశ్వరరావు, కె.విశ్వేశ్వరరావు, కర్రి మణికంఠ,అన్నాబత్తుల దుర్గాప్రసాద్, కొల్లి వెంకటరావు, గార గౌరీరావు, పల్లెం రాజా, కేశవ, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

ఎమ్మెల్యేకు భవన నిర్మాణ కార్మికుల వినతి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాయిపల్లి రాము ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో పోరాడి సాధించుకున్న భవన నిర్మాణ కార్మికులకు 1996లో సంక్షేమ బోర్డు చట్టం రాష్ట్ర ప్రభుత్వం 2009 నుంచి అమలు చేస్తుందన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు కాలేదన్నారు. ఇసుకపై ఆంక్షలు విధించడం వల్ల కరోనా రెండేళ్లలో భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని అన్నారు. దీంతో అప్పులు చేసుకుంటూ కుటుంబ పోషణ చేసుకున్నారని తెలిపారు. కావున పెండింగ్ క్లైములకు నష్టపరిహారాలు తక్షణమే చెల్లించాలని, 2019లో పెండ్లికానుక, సహజ మరణాలు, ప్రసూతి పరిహారం వెంటనే చెల్లించాలని, అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ వృద్ధాప్య, వికలాంగు పెన్షన్లు అమలు చేయాలని, ప్రభుత్వం దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులు ఆ బోర్డుల్లో జమ చేయాలని, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిని అందజేసిన వారిలో భవన నిర్మాణ కార్మికులు శనపతి రామకృష్ణ, టి.రమేష్, వై.వాసు, బి.శ్రీను, జి.వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిని అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గెలుపునకు సైనికుల్లా పని చేయాలి

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త సైనికుడల పనిచేసి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం జియ్యమ్మవలస మండలం పెదమేరంగి కూడలిలో గల కల్యాణ మండపం వద్ద మన భవిష్యత్తుకు గ్యారెంటీ తెలుగుదేశం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా టిడిపి కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని టిడిపి పార్టీలో గ్రూపు రాజకీయాలు చేస్తూ అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలు అవాస్తమని, నియోజకవర్గం టిడిపి టికెటును ఆశిస్తున్న బిడ్డిక తమ్మయ్య, బిడ్డిక పద్మావతి, పువ్వల లావణ్య, ఆర్ఎస్ విజయ్‌కుమార్, భూపతిదొరలో ఈ ఐదుగురు ఆశావాహుల్లో ఏ ఒక్కరికీ చంద్రబాబునాయుడు టిక్కెట్ ఇచ్చినా వారికి తామంతా కలిసికట్టుగా పనిచేసే గెలిపించుకోవడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలం టిడిపి అరకు పార్లమెంటరీ అధ్యక్షులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, మాజీ ఎంపిపి జివి రమణమూర్తి, టిడిపి సీనియర్ నాయకులు బండి రాజు, బిడ్డిక కడాయి, టిడిపి యువ నాయకులు చందక రామకృష్ణ, సువ్వాన గోవింద నాయుడు, మురళి, సీతారాం, ఐదు మండలాల టిడిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

షెడ్యూల్ ప్రకారం పిల్లలకు టీకాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

షెడ్యూల్ ప్రకారం అర్హులైన పిల్లలందరికీ టీకా కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాలు పూర్తయ్యేలా వైద్య సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సిబ్బందికి ఆదేశించారు. బుధవారం మండలంలోని నడుకూరు, కంబర, నడింకెళ్ల గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమం నిర్వహణ తనిఖీ చేశారు. రికార్డుల్లో అర్హుల జాబితా పరిశీలించి ఎంతమందికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు, ఏఏ టీకాలు వేశారని సిబ్బందిని ఆరా తీశారు. కార్డుల్లో టీకా నమోదు తేదీలు, గడువు తేదీలను పరిశీలించారు. పిల్లలకు వేస్తున్న ప్రతి వ్యాధి నిరోధక టీకాపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే అత్యవసర మందులు ఉండాలన్నారు. వ్యాధి నిరోధక నిర్వహణ వివరాలన్నీ ఎప్పటికప్పుడు రికార్డులో ఆన్లైన్లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని, ఏ చిన్న సమస్య గుర్తించినా, వెంటనే వైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడ్, శకుంతల, హేమలత, సరస్వతి, హారిక, రామకృష్ణ, అనూష, శ్రీనివాసరావు, రోజారాణి, శ్రీదేవి, గౌరీశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి- గరుగుబిల్లి

ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని రావుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) తెలిపారు. మండల పరిధిలోని రావు పల్లి గ్రామంలోని మండల పరిషత్తు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన 4వ విడత అమ్మఒడి ఉత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులకు జగనన్న కిట్లు, ఇతర అవసరమైన వస్తువులు దాదాపుగా పంపిణి చేసిందని అన్నారు. అధికారులు, ఉపాధ్యాయుల కృషితో పదో తరగతి పరీక్షల్లో 87.40శాతం సాధించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో మన్యం జిల్లా నిలించిందని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాదారులతో బ్యాంకులు కిటకిట

ప్రజాశక్తి - సాలూరురూరల్

అమ్మఒడి, ఆసరా డబ్బులు తీసుకునేందుకు వచ్చేమహిళలు, వ్యవసాయ రుణాలు కోసం వచ్చే రైతులతో మండలం లోని మామిడిపల్లి, తోణాంలో గల బ్యాంకులు ఖాతాదారులతో కిటకిట లాడుతున్నాయి. గ్రామంలో గల యూనియన్ బ్యాంక్, వికాస్ గ్రామీణ బ్యాంక్‌తో పాటు తోణాంలో కెనరా బ్యాంక్ ఖాతాదారులతో గత నాలుగు రోజులు నుంచి కిక్కిరిసి పోతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసల కోర్చి బ్యాంకులకు వచ్చినప్పటికీ నగదు లేదని బ్యాంక్ సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుదిరుగు తున్నారు. తాము దాచుకున్న డబ్బు సమయానికి చేతిలో ఉండకపోవడంతో కూలీలు, చిన్న చిన్న వర్తకులు, వ్యవసాయదారులు నానా అవస్థలుపడుతున్నారు. దీనికి తోడు బ్యాంక్‌ల్లో ఇంటర్ నెట్ సర్వర్లు పనిచేయకపోవడంతో కనీసం వారానికి రెండు, మూడు రోజులు ఇబ్బందులు తప్పడంలేదు. అలాగే మామిడిపల్లిలో బిఎస్ఎన్ఎల్ నెట్ సిగ్నల్స్ పని చేయకపోతే బ్యాంక్ వద్ద నో నెట్ వర్క్ అని బోర్డులు పెడుతున్నారని ఖాతాదారులు వాపోతున్నారు. ఈ సమస్యలను సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని ఖాతాదారుల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

ఖాతాదారులతో కిటకిటలాడుతున్న యూనియన్ బ్యాంకు

ఖాళీ పోస్టుల భర్తీకి నేడు ధర్నా

ప్రజాశక్తి - బెలగాం

వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేపట్టనున్నట్టు ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 55 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, గ్రూప్-2 పోస్టులను పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ ఈ ధర్నా చేపడుతున్నామన్నారు. ఈ ధర్నాకు యువత పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బిటి నాయుడు, కె.గోపి నాయుడు, ఎస్.కిరణ్ కుమార్, రాజు, బాలు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ఉద్యమం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

సంతాల్ తిరుగుబాటు దినం సందర్భంగా దేశవ్యాప్తంగా ఆదివాసీ హక్కుల పరిరక్షణకై ప్రతినబూనుతూ సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలని అఖిల భారత ఆదివాసీ వేదిక (ఏ.ఐ.టి.ఎఫ్) ఇచ్చిన పిలుపుమేరకు ఆ సంఘ జిల్లా విభాగం నాయకులు బుధవారం కోరి, చందలంగి గ్రామాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐటిఎఫ్ జాతీయ కమిటీ సభ్యులు సంబుడు జయలక్ష్మి, ఎఐకెఎంఎస్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బొత్స నర్సింగరావు, పిఒడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రమణి మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆదివాసీలకు కల్పించిన హక్కులు, రక్షణలను రద్దుచేసే వైపుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, మన అడవి, భూములు, సంపదలను పరిరక్షించుకోవడానికి ఆదివాసీలంతా సంఘటితంగా ఉద్యమించాలన్నారు. అందుకోసం అఖిల భారత ఆదివాసీ వేదిక పనిచేస్తుందని చెప్పారు. పాలకులు సాగిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను ఎదిరించి, మన హక్కులను కాపాడుకోవడానికి ఎఐటిఎఫ్ నాయకత్వంలో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

జబ్బవాపు నివారణకు వ్యాక్సిన్లు

ప్రజాశక్తి-గరుగుబిల్లి

ప్రస్తుత వర్షాకాలం పశువులకు జబ్బవాపు గొంతువాపు వ్యాధులు వ్యాపించకుండా వ్యాక్సిన్ వేయనున్నట్లు ఉల్లిభద్ర పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్.సురేష్ కుమార్ తెలిపారు. కొంకడివరం గ్రామంలో బుధవారం పశుసంవర్ధకశాఖ అధికారులు పశువులకు జబ్బవాపు, గొంతు వ్యాపు వ్యాధుల నివారణకు సంబంధించిన వ్యాక్సిన్‌లు వేశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ గొర్రెలకు,మేకలకు నట్టల నివారణకుసంబంధించిన వ్యాక్సిన్ వేశామని పేర్కొన్నారు.

పొలంబడి నిర్వహణకు బ్యాలెట్ బాక్స్ టెస్ట్

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతి బుధవారం పత్తి పంటపై మండలంలోని అమ్మవలసలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి 14 వారాల పాటు నిర్వహించబడుతుందని, రైతుల విషయ పరిజ్ఞానాన్ని పొలంబడి నిర్వహణకు ముందుగా తెలుసుకునేందుకు వివిధ అంశాలపై బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించడం ముఖ్యమని సాలూరు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రావు అన్నారు. బ్యాలెట్ బాక్స్ టెస్ట్ పొలంబడి ప్రారంభానికి ముందు రైతుల విషయ పరిజ్ఞానాన్ని తెలుసుకోవడానికి నిర్వహించనున్నామన్నారు. అలాగే 14 వారాల పొలంబడి నిర్వహణ తర్వాత కూడా బ్యాలెట్ బాక్స్ టెస్ట్ నిర్వహించబడుతుందని, దీని ద్వారా రైతుల విషయ పరిజ్ఞానం ఏ మేరకు పెరిగిందో తెలుసుకోవచ్చని అన్నారు. అమ్మవలస డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో మాట్లాడుతూ పొలంబడి ప్రారంభానికి ముందుగా రైతులతో 15 నిమిషాల పాటు ఆటలాడించడం వల్ల రైతులను సమాయత్తపర్చవచ్చని కావున తప్పనిసరిగా ప్రతి వారం రైతులతో ఆటలాడించి సమిష్టి నిర్ణయాల దిశగా రైతులను సమాయత్తపర్చాలని తెలిపారు. అనంతరం రైతులను బృందాలుగా విభజించి బృంద విన్యాసాలు చేపట్టారు. సామాజిక చెరువు గట్ల మీద కంది విత్తనాలు నాటించారు. గట్లపై కంది విత్తనాలు నాటడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని, కావున 100శాతం రాయితీపై ప్రభుత్వం కంది విత్తనాలను అందిస్తుందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, ప్రకృతి సేద్య సిఆర్‌పి బాలకృష్ణ ఐసిఆర్‌పి విజయ్, విఎఎ మోహన్‌కృష్ణ, గ్రామపెద్ద అప్పారావు, రైతులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ప్రభుత్వ కొలువు సాధనలో ఆగిన శ్వాస

పరుగు పోటీలో యువకుడు మృతి

ప్రజాశక్తి-రామభద్రపురం

మహారాష్ట్ర పూణెలో బిఆర్ఒ రిక్రూట్మెంట్ పరుగు పోటీలో పాల్గొన్న రామభద్రపురానికి చెందిన చొక్కాపు మురళీకృష్ణ (29) మృతి చెందాడు. బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ లో స్టోర్ కీపర్ టెక్నికల్ పోస్ట్ కోసం కాల్ లెటర్ రావడంతో రెండు రోజులు క్రితం అక్కడకు వెళ్లి కొన్ని ఈవెంట్లలో పాల్గొన్నాడు. బుధవారం 1600 మీటర్ల పరుగుపోటీలో పాల్గొని పరుగెడుతుండగా మార్గమధ్యంలో సొమ్మసిల్లి పడిపోయాడు. వెంటనే స్పందించిన అదికార యంత్రాంగం వైద్యాధికారులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి పరీక్షించి చూడగా అప్పటికే శ్వాస ఆగి మతి చెందినట్లు ధవీకరించారు. ప్రభుత్వ కొలువు సాదిస్తానని చెప్పి వెళ్లిన కుమారుడు విగత జీవిగా వస్తున్నాడని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. మురళీకృష్ణ మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

1500 లీటర్ల మద్యం ధ్వంసం

ప్రజాశక్తి - సాలూరురూరల్

అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన సుమారు 1500 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట విరుద్ధంగా, అక్రమ మార్గాల్లో తరలిస్తూ గత కొంతకాలంగా పట్టుబడిన సుమారు 1500 లీటర్ల మద్యాన్ని పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరింటెడెంట్ వారి ఆదేశాలు ప్రకారం బుధవారం ట్రాక్టర్‌తో వాటిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. గత కొంతకాలంగా సారాయిను అక్రమంగా నాలుగు చక్రాలు, త్రిచక్రాలు, ద్విచక్రాలు వాహనాలను సీజ్ చేసినట్లు, సీజ్ చేసిన వాహనాలను వేలం పాట వేయగా రూ.లక్షా60వేలు వచ్చినట్లు తెలిపారు